# హోటల్ టాప్‌స్టార్.

రాష్ట్ర రాజధానిలో ఉన్న ఏకైక ఐదు చుక్కల హోటలు. అక్కడ గది అద్దెలు కూడ చుక్కల్ని తాకుతూ ఉంటాయి. ఆ హోటల్లో వంద రూపాయల నోటు రూపాయి నోటుతో సమానం.

అక్కడి కొచ్చే కస్టమర్లకి డబ్బు గుణం బాగా తెలుసు. అంచేత వాళ్ళెప్పుడూ కష్టపడరు. వాళ్ళకున్న డబ్బే వాళ్ళ తరుపున కష్టపడి మరింత డబ్బు సంపాయించిపెడుతుంది. ఆ హోటలోని టెలిఫోన్లకి, టీపాయ్‌లకి డోర్ మాట్స్‌కి కూడ సులభంగా డబ్బు సంపాయించటమెలాగో తెలుసు.




## రాబందులు

### శ్యామల జయరామరెడ్డి

అందుకే హోటల్ టాప్‌స్టార్ చుట్టూ అరమైలు వరకూ డబ్బు కంపు కొడుతూ ఉంటుంది.

అలాంటి డబ్బుహోటల్లో..ఐదోనెంబరు సూట్‌లో..నిన్నటిన్నుంచీ ఉంటూన్న డబ్బు మనిషి మామూలు మనిషి కాదు అతి ముఖ్య వ్యక్తి. మరియు గొప్ప దేశభక్తుడు. దేశభక్తుడంటే ఎవరు? దేశం కోసం పక్కవాడి ప్రాణాల్ని తృణప్రాయంగా సమర్పించే వాడన్న మాట. అతను నిన్న యమ్మెల్యే. ఇవ్వాళ యం. పి. రేపు రాష్ట్ర మంత్రి. కేంద్రమంత్రీ కావొచ్చు. అతనా సూట్‌లో ఉన్నంతసేపూ టెలిఫోన్‌కీ, కాలింగ్‌బెల్‌కీ. రూమ్‌బోయ్‌కీ విశ్రాంతి ఉండదు. వచ్చిపోయే విజిటర్లకీ. కాఫీ కప్పులకీ. విస్కీ సీసాలకీ తెంపు వుండదు. అయినా రూమ్ బోయ్‌లు విసుక్కోరు. ఎందుకంటే అతను నోట్లు తప్ప చిల్లరడబ్బు చేత్తో ముట్టడు.

ఆ అ.ము.వ్య పేరు రంగారెడ్డి.

వయసు యాభై.

యాపిల్ జ్యూస్. బత్తాయి రసం. ఫెయిర్ అండ్ లవ్‌లీ- అతన్ని ముప్పై ఏళ్ళవాడిలా కనిపింపజేస్తాయి.

అతనాక్షణంలో నీళ్ళతడి తగిలిన అట్ల పెనంలా చిటపటలాడిపోతున్నాడు. పావు గంటలో మూడో డన్‌హిల్ సిగరెట్ ముట్టించి రెండు దమ్ములు లాగి కసిగా యాష్‌ట్రేలో నలిపేస్తూ "ఎవర్రా ఆ టెలిఫోన్ ఆపరేటరు? అర్జంట్ కాల్ పెట్టి అయిదు నిమిషాలైనా ఇంకా రాలేదంటుందేం? బోర్డు దగ్గర తీగెలు కలుపుతుందా. రిసెప్షను కుర్రాడి నరాలు మెలిపెడుతుందా?" అన్నాడు రంగారెడ్డి యం.పి. కసిగా రిసీవరు పెట్టేస్తూ.

"మళయాళీ పిల్లండీ. ఇంకా పెళ్ళికాలేదు. చందమామలాగుంటది గుంట" అన్నాడు రూమ్ బోయ్.

"చేతికందేదేనా?"

"రాత్రికి దింపెయ్యమంటారేటి?" ఆశగా అడిగాడు రూమ్‌బోయ్.

"రాత్రికా-వద్దులే. రాత్రికి పార్టీ వొకటుంది రేపురాత్రికి చూద్దాం-" అంతలో టెలిఫోను మోగింది.

"రంగారెడ్డి హియర్. జిల్లా పరిషత్ చైర్మన్ రామరాజుగారేనా? ... నమస్తే.... నా జాబు అందిందన్నమాట! గాడ్ బ్లెస్ ది పోస్టల్ డిపార్ట్‌మెంట్!... నిన్ననే నాలుగ్గంటల ఫ్లైట్‌లో వచ్చాను.... యేం లేదు- చిన్నపార్టీ- అంతకంటే చిన్నపనీ....ఆఁ ఆఁ నర్సింగరావుగారుకూడ వస్తున్నారు. మీరు రాత్రి ఎనిమిదింటికల్లా ఇక్కడుండాలి. తప్పదు!.... ఆఁ. అదికూడ ఉంటుంది- మీరు కావాలంటే! డిసప్పాయింట్ చెయ్యనుగా? అదే హోటల్- అదే సూట్- రాత్రి ఎనిమిది- మీ కారుందా. నా కారు పంపనా?.... గుడ్. సో లాంగ్!" అంటూ రిసీవరు పెట్టేసి మరో డన్‌హిల్ ముట్టించి "విన్నావ్‌గదరా? ముసిలిముండా కొడుకు- కిల్లు బానలా పొట్ట వాడూను- పిల్ల కావాలట! పిల్ల! తప్పదు మరి. పక్క సూట్ నా పేర రిజర్వ్ చెయ్యమని రిసెప్షన్‌లో చెప్పి ఎనిమిది గంటలకల్లా ఆ టెలిఫోను సుందరిని ఈ సూట్‌లోకి దింపెయ్. దాన్ని దీన్ని దింపకపోతే నిన్ను పైకి పంపేస్తాను. తెల్సిందా నా సంగతి?"

"తెల్సిందండి. నేను మాటంటే మాటే"

అన్నాడు రూమ్ బోయ్.

"సరే ఇక బయటికితగలడు. నాకు నిద్ర వస్తోంది."

రూమ్ బోయ్ ఖాళీ ప్లేట్లూ, కప్పులూ తీసుకొని వెళ్ళిపోయాడు. రంగారెడ్డి డబుల్ బెడ్ మీదపడి మరుక్షణంలో గుర్రుపెడుతూ నిద్ర ోయాడు.


అప్పుడు టైము ఉదయం పది గంటలు.

అతి ముఖ్య వ్యక్తులూ, అయిదు చుక్కల హోటళ్ళు అంతే—పగలంతా నిద్ర రాత్రంతా పని! హోటల్ టాప్ స్టార్కి మరో పేరు నైట్ టైమ్ సెక్రటేరియెట్! చికెన్ రోస్టులూ, స్కాచ్ విస్కీల మధ్య ఆ హోటల్లో ముఖ్యంగా ఆ ఐదో నెంబరు సూట్లో రాష్ట్ర పాలనలో ముఖ్య నిర్ణయాలు — అప్పుడప్పుడు— జరుగుతూ ఉంటాయి. ఎందుకంటే ఆ సూట్ పర్మనెంట్గా యం. పి. రంగారెడ్డి కిందనే ఉంటుంది.

పగలంతా నిద్రపోయిన ఐదో నెంబర్ సూట్ రాత్రి ఎనిమిదయ్యేసరికి వోపిక తగ్గని భోగంపిల్లలా తయారైంది. రాజకీయ బ్రహ్మ విష్ణు మహేశ్వరులని పేరు తెచ్చుకున్న నర్సింగరావ్, రంగారెడ్డి, రామరాజులు టీపాయ్ చుట్టూ సభ తీర్చి కూర్చున్నారు టీపాయ్ మీద జానీవాకర్ బాటిలు ముఖ్యమంత్రిలా ఠీవిగా ఉంటే స్పెన్సర్ సోడాలు కాబినెట్ మంత్రుల్లా చేతులు కట్టుకొని ఉన్నాయి. టెలిఫోను చందమామ కాసిని తళుకులూ, మరికాసిని కులుకులూ కలిపిన కాక్టేల్ గ్లాసుల్లో నింపి అందిస్తూండగా మొదటి రౌండ్ బాతాఖానీతో ముగిసింది. రెండో రౌండ్ వచ్చేసరికి రంగారెడ్డి టెలిఫోన్ సుందరి చేతిలోని బాటిల్ అందుకుని "అమ్మడూ, మేం కొంచెం మాట్లాడుకోవాలి గాని నువ్వు నాలుగో నెంబరు సూట్లో కొంచెం రెస్టు తీసుకొంటూ వుండు. పిల్చిందాకా రాకు" అని తనే గ్లాసులు నింపుతూ అసలు విషయం చెప్పటం మొదలెట్టాడు.

"మనం ముగ్గురం రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకీ ప్రతినిధులం. మనలో ఎవరు ఏపార్టీ మార్చినా,పదవులున్నా లేకపోయినా మన రాజకీయ స్నేహం ఇరవై ఏళ్ళుగా నిరాటంకంగా కొనసాగుతూ వస్తోంది. మీ వీపు జిలపుట్టినప్పుడల్లా నేను గోకాను.

నా వీపు జిలపుట్టినప్పుడల్లా మీరు గోకారు. అదీ కోపరేషనంటే సరే, అసలు సంగతి— ఇవ్వాళ అధికారంలోవున్నది మన పార్టీయే అయినా నా పలుకుబడీ, నా ప్రిస్టేజ్ నాశనమైపోయే ప్రమాదం వచ్చిపడింది.




అందుకే మనమిప్పుడు ఇక్కడ సమావేశమయ్యాం! గట్టిగా ఆలోచించి ఈ రాత్రికే మనం వొక నిర్ణయానికి రావాలి. దానికి మీరిద్దరూ సహాయపడాలి ఏమంటారు?" స్కాచ్ నిషా కొద్దిగా తలకెక్కిన రంగారెడ్డి ఉపన్యాస ధోరణిలో చెప్పి ఊపిరి పీల్చుకోటానికి ఆగాడు.

టెలిఫోను సుందర్ని అక్కణ్ణుంచి పంపేసినందుకు కాస్తమంటగావున్న రామరాజు "ఉపన్యాసం అదరగొట్టేశావయ్యా రెడ్డీ! కాని ఇది పార్లమెంటూ కాదు; బహిరంగ సభాకాదు. నీ ఉపన్యాసం పేపర్లో పడదు. కాబట్టి అసలు విషయమేమిటో సూటిగా చెప్పరాదూ" అన్నాడు.

"భాస్కరరావు లేడూ-అదే మన చిన్నతరహా పరిశ్రమల మంత్రి-వాణ్ణి దింపెయ్యాలి." అన్నాడు రంగారెడ్డి.

"అందుకైతే నేను తయార్" అన్నాడు మితభాషి, రాజకీయ బ్రహ్మ అయిన నర్సింగరావ్.

"నేనాపని చెయ్యాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను" అన్నాడు రామరాజు-తాత్కాలికంగా టెలిఫోను సుందరిని మర్చిపోయి.

తన ప్రతిపాదన మిగిలిన ఇద్దరూ అంత త్వరగా అంగీకరించినందుకు సంతోషిస్తూ "గుడ్, వెరీ గుడ్! అందుకేం చెయ్యాలో చెప్పండి" అన్నాడు రంగారెడ్డి సాలోచనగా నర్సింగరావ్ వేపు చూస్తూ. రామరాజు చూపులు కూడా నర్సింగరావ్ మీదికే మళ్ళాయి-మీరే చెప్పాలన్నట్లు.


నర్సింగరావ్ ఎన్నడూ ఏ పదవీ అలంకరించకపోయినా ఎంతో అధికారం అతని గుప్పెట్లో ఉంటుంది. రాజకీయాల్లో అతను కింగ్మేకర్! అసలు ప్రజాస్వామ్యానికి సరైన నిర్వచనం చెప్పిన మేధావి అతను! అతని నిర్వచనం ప్రకారం ప్రజాస్వామ్యమంటే ధనికుల దోపిడీనుంచి పేదలను రక్షిస్తామని పేదల ఓట్లూ, పేదల తిరుగుబాటు నుంచి ధనికుల్ని రక్షిస్తామని వాళ్ళ డబ్బూ దోచుకోవటమన్నమాట.

నర్సింగరావ్ ఒక క్షణం కళ్ళుమూసుకుని ఆలోచించి, ఆ తర్వాత మూడోకన్ను కూడ విప్పి "అదేమంత పెద్ద పనికాదు రెడ్డీ సాబ్! ఇప్పటికే ఆ భాస్కరరావుమీద సి.యమ్.వద్ద గిన్నిఫిర్యాదులున్నై. మనం మన వర్గంలో ఉన్న లెజిస్లేటర్లు జిల్లా పరిషత్ చైర్మన్లు, సమితి ప్రెసిడెంట్ల చేత ఆ భాస్కరరావును వెంటనే గద్దె దింపాలని మెమోరాండం పెట్టిద్దాం. ఆ తర్వాత భాస్కరరావు మంత్రిగా కొనసాగితే వాడి లంచగొండితనంవల్ల రాష్ట్రంలో మన పార్టీ నాశనమైపోతుందని పేపర్లలో తెగ అచ్చొద్దాం. ఎవరైనా కిస్ కిస్మని శబ్దం చేసే చక్రానికే గదా నూనె వేసేది! అందువల్ల ముఖ్యమంత్రి భాస్కరరావుని తన మంత్రి వర్గం నుంచి తొలగించక తప్పదు. ముఖ్యమంత్రి లొంగకపోతే ఢిల్లీ పోయి హైకమాండ్తో చెప్పే బాధ్యత నాది. ఏమంటారు?" అన్నాడు.

"నా చేతిలో ఎనిమిది మంది యమ్మెల్యేలు, పన్నెండు మంది సమితి ప్రెసిడెంట్లూ ఉన్నారు" అన్నాడు రామరాజు.

"నేను ఇరవై మంది లెజిస్లేటర్లూ, ముగ్గురు యం.పి.లచేత సంతకాలుచేయించగల్ను. ఢిల్లీలో మన పార్టీ కార్యదర్శి సురేంద్రనాధ్ాయ్ నా మంచి ఫ్రెండ్. అతనికి చెప్పి అధిష్టానవర్గం ద్వారా ముఖ్యమంత్రిమీద వత్తిడి తీసుకురాగల్ను" రంగారెడ్డి ఉత్సాహంగా తన రాజకీయ బలాన్ని వివరించాడు.

"తెలంగాణా లెజిస్లేటర్లలో సగం మంది నేను హుస్సేన్ సాగర్లో దూకమంటే




ఎందుకని అడగరు- దూకుతరు- అంతే. మీరు మీవాళ్ళ చేత మెమొరాండంమీద దస్కత్తులు చేయించి నాకియ్యండి. తర్వాత పైరవీ నా కొదిలెయ్యండి. బస్" అన్నాడు నర్సింగరావ్.

"బస్! కాని భాస్కర్రావు దిగిపొయ్యే లోపల వాడి చేతులతోనే నా రెండో అల్లుడి సాల్వెంటు ఎక్స్ట్రాక్షను ప్లాంటుకి లైసెన్సు ఇప్పించుకోవాలి! అప్పుడే నా వాళ్ళలో నా ప్రిస్టేజ్ నిలబడుతుంది. ఇప్పటివరకూ నేను ఎన్నోసార్లు పర్సనల్‌గా చెప్పాను. అన్ని రకాలుగా ప్రయత్నించాను గాని భాస్కర్రావు చేత లైసెన్సు మాత్రం ఇప్పించుకోలేకపోయాను. ఇదుగో చేస్తానంటాడేగాని చెయ్యలేదు-"

"భాస్కర్రావంటే కోపం అందుకన్న మాట! దీనికొకటే మార్గం. భాస్కర్రావు డబ్బు మనిషి. నలభయ్యో. యాభయ్యో పడేస్తే నీ లైసెన్సు నీ ఇంటి కొస్తుంది" సలహా ఇచ్చాడు రామరాజు.

"వ్హాట్! మనకి తీసుకోటమే గాని ఇవ్వటం చేతగాదే!" అన్నాడు రంగారెడ్డి.

"ఈ వయసులో ఆ అలవాటు మార్చుకోటం మనవల్ల కాదు."

"అయితే పిచ్చిరెడ్డీ, నీ లైసెన్సు గోవిందా!"

"ఇవ్వాళ్రేపు అంతా లంచాలమీదే నడుస్తున్నరు. చీఫ్ మినిస్టర్ చెప్పిన ఇవడు ఆ భాస్కర్రావు. రామ్‌రాజ్ సాబ్ చెప్పిందే మంచిసలహా" అన్నాడు నర్సింగ్ రావ్.

"అంతేనంటారా?.... సరే ఇస్తాను కాని నేనిస్తే భాస్కర్రావు తీసుకోడు. ఇవ్వకపోతే పని చెయ్యడు. ఎవరిద్వారా-ఎట్టా ఇవ్వాలో నాకు తెలియదే" అన్నాడు రంగారెడ్డి.

"సుధాకర్ అని భాస్కర్రావు పియ్యే వొకడున్నాడు. ఇటువంటి వ్యవహారాలన్నీ చూసేది అతనే. కావాలంటే రేపతణ్ణి పరిచయం చేస్తాను. ఎమౌంటు ఎంతో కూడ అతనే చెప్తాడు" అన్నాడు రామరాజు.

"మన్లో మనకి రహస్యాలేమిటిగాని ఈ వివరాలన్నీ నీకెట్టా తెలుసు?" అడిగాడు రంగారెడ్డి.

"చెప్పుకొంటే సిగ్గు! జనంలో నాకంత పేరుందా! ఏం లాభం? స్వయానా నా మేనల్లుడు- విజయవాడ ఆటోనగర్‌లో టైర్ల ఫాక్టరీ పెడతానంటే. దానికేం— కానీ అన్నాను. అప్లికేషను పెట్టి ఆర్నెల్లయింది. లైసెన్సురాలేదు. ఇదుగో చూస్తాను అదుగో చూస్తానంటాడు భాస్కరరావు. కాని పని మాత్రం చెయ్యలేదు. చివరకు విన్నవే- నలభై వేలు-పియ్యే సుధాకర్ ద్వారా సమర్పించుకోవాల్సివచ్చింది! రెండుమూడు రోజుల్లో ఆ లైసెన్సు నా చేతికొస్తుంది. అందుకే వాడంటే నాకు మంట!"

"కేంద్రంలో వాడి చుట్టం వొకడు ప్రధానికి సలహాదారు. అందుకే వాడికా గర్వం!"

"ఏమైనాసరే. వాణ్ణి పదవిలోంచి దింపెయ్యాల్సిందే!" ఆవేశంగా అన్నాడు రంగారెడ్డి.

"నీ పనీ. నా పనీ అయింతర్వాత— అంతేగా? సరే మన సమావేశం ఇక ముగిసినట్లేనా? నాకు నిద్ర వస్తోంది." అన్నాడు రామరాజు ఆవులింత నటిస్తూ.

రంగారెడ్డి నవ్వి "నీ నిద్రంటే ఏమిటో నాకు తెల్సులేవయ్యా! మరీ కొత్త పెళ్ళికొడుకులా ఏమిటా తొందర! సరే వెళ్ళు. చందమామ నాలుగో నెంబర్లో వుంది. వెళ్ళగలవా. తోడు పిలవనా?" అన్నాడు.

"మరీ అంత తాగటం చాతకాని వాణ్ణి కాదులే రెడ్డీ" అంటూ నాలుగో నెంబరు సూట్ వైపు నడిచాడు రామరాజు.

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల విధులు వరసగా సృష్టి, స్థితి, లయలని చెబుతూ వుంటారు. కాని ఈ రాజకీయ బ్రహ్మ విష్ణు మహేశ్వరుల విధులు మాత్రం అప్పుడప్పుడు గతులు తప్పుతూ వుంటాయి. ఇవ్వాళ ఐదో నెంబరు సూట్‌లో అదే జరిగింది. ఏమైతేనేం భాస్కర్రావనే చిన్న తరహా పరిశ్రమలమంత్రి పతనానికి పునాది పడింది.

రాబందుల గోల అంత. బలహీనమైన రాబందుని మిగతా రాబందులే నిర్దయగా చీల్చి తింటాయి. అది వాటి జీవిత విధానం.

మర్నాడు ఉదయం భాస్కర్రావు పియ్యే సుధాకర్రావుని కలవటం ముప్పైవేలకి బేరం కుదరటం జరిగింది.

"మీరు లైసెన్సు ఇప్పించండి-అదే క్షణంలో మీ ముప్పైవేలు మీకిచ్చేస్తాను" అన్నాడు రంగారెడ్డి.

పియ్యే నవ్వి "ఇక్కడ అప్పులెలా కుదుర్తాయండీ? క్యాష్ డౌన్ చెయ్యాల్సిందే" అన్నాడు.

"ఒకవేళ పనికాకపోతే?—నా డబ్బుకి సెక్యూరిటీ ఏమిటి?"

"నా మాటే మీకు సెక్యూరిటీ! నమ్మాల్సిందే- తప్పదు. అప్టరాల్ ముప్పైకే మీరింత అనుమానపడుతున్నారు. ఈ చేతి మీదిగా లక్షలతో కూడిన వ్యవహారాలు జరిగాయి. నమ్మకం-హానెస్టీ ఈజ్ అవర్ మోటో!"

రామరాజు మధ్యవర్తిగా హామీ ఇచ్చాక రంగారెడ్డి డబ్బు ఇచ్చాడు.

"మీరిక నిశ్చింతగా ఉండండి. ఎల్లుండి సాయంత్రం నాలుగ్గంటలకి మీ లైసెన్సు రెడీగా ఉంటుంది. వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు పియ్యే.

"ఇందులో వీడికెంత ఉంటుందో కమిషను?"

"చాలా! లేకపోతే పెధవ పియ్యేగాడు- బాలానగర్‌లో మూడంతస్తుల బిల్డింగు. కోనసీమలో పదెకరాల కొబ్బరి తోట. కారూ- ఇవన్నీ ఎలా వస్తాయ్? అఫ్‌కోర్సు ఇవన్నీ వీడి పేర ఉండవనుకో."

ఇక "ఆపరేషన్ ఓస్టర్"లో— అది నర్సింగరావ్ పెట్టిన ముద్దు పేరు— రెండో దశ ఆ రోజు రాత్రే మొదలైంది.

దానికి నాందిగా హోటల్ సవేరాలో రంగారెడ్డి గొప్ప డిన్నరు ఏర్పాటుచేశాడు. నర్సింగరావ్, రామరాజు రాలేదు గాని, వారికి సంబంధించిన లెజిస్లేటర్లంతా వచ్చారు. నోటితో చెప్పకపోయినా వారందరికీ భాస్కర్రావంటే గిట్టదని మాత్రం




తెలిసిపోయింది. ఎందుకంటే దాదాపు అందరూ భాస్కర్రావు బాధితులే! అందువల్ల మెమొరాండం మీద సంతకాలు పెట్టించటం పావుగంటకూడా పట్టలేదు రంగారెడ్డికి! ఇక భాస్కర్రావు దిగిపోయినట్టే!

ఆ ఉత్సాహంతో రాత్రి రెండుగంటలకు 'టాప్‌స్టార్'లోని తన సూట్‌కి వచ్చేసరికి టెలిఫోన్ మోగుతోంది.

"రంగారెడ్డి స్పీకింగ్-"

అవతలనుంచి రామరాజు "అరగంట నుంచీ నీ కోసం ఫోన్ చేస్తున్నాను.... కొంప మునిగిందయ్యా రెడ్డీ!" అన్నాడు ఉద్వేగంగా.

"ఉద్రేకపడకు. అసలే బీపీ మనిషివి. జరిగిందేమిటో నింపాదిగా చెప్పు" అన్నాడు రంగారెడ్డి.

"నింపాదిగా చెప్పుతుంటావేమయ్యా బాబూ. నా నలభై వేలూ. నీ ముప్పైవేలూ గోవిందా! భాస్కర్రావు మంత్రివర్గం నుంచి రాజీనామా చేశాడు!"

"నేనమ్మను—జుట్టుపట్టుకొని గుంజినా పదవి వొదిలిపెట్టని భాస్కర్రావు రాజీనామా చేశాడంటే నే నమ్మను! మందు నిషాలో లేవుగదా !"

"మందూ లేదు పాడూ లేదు. భాస్కర్రావుమీద ఎప్పట్నుంచో లంచగొండనే కంప్లైంట్లు ఉన్నాయిగదా— ముఖ్యమంత్రిగారు ఇప్పటికొక నిర్ణయానికొచ్చి, భాస్కర్రావుని రాజీనామా ఇవ్వవలసిందిగా కోరుతూ రాత్రి పన్నెండుగంటలకి ఒక ప్రత్యేక దూతను భాస్కర్రావు బంగ్లాకి పంపాడట.—"

"వెంటనే రాజీనామా ఇచ్చేశాడా ?"

"ఇవ్వకేం చేస్తాడు! వాడికొక స్వంత బలమంటూ వుండి చస్తేగా! నోరు మూసుకొని రాజీనామా పత్రం మీద సంతకం పెట్టేశాడు."

"ఏ కారణం వల్ల రాజీనామా చేస్తున్నదీ అందులో వుందా— లేక—"

"అదంతా పకడ్బందీగానే జరిగింది... రాజీనామా పత్రం ముఖ్యమంత్రిగారే స్వయంగా డిక్టేట్ చేసి పంపాడట. దాని సారాంశమేమంటే —ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ యంత్రాంగాన్ని పటిష్ఠపర్చటానికి నా యావచ్ఛక్తినీ ధారపోయాలనే నిశ్చయానికొచ్చాను. అందువల్ల ముఖ్యమంత్రిగారు నా రాజీనామాను ఆమోదించవలసిందిగా కోరుతున్నాను— ఇప్పటికైనా అర్థమైందా?"

"మైగాడ్. ఇవన్నీ నీకెలా తెల్సు?"

"ముఖ్యమంత్రి శిబిరంలో మనవాడొకడున్నాడ్లే — వాడు ఫోన్ చేసి చెప్పాడు. ఇప్పుడేం చేద్దాం?"

"ఏమో-నాకేం తోచడంలేదు.. నర్సింగరావ్ దగ్గరికెళ్దాం పద - అతనే మనకో మార్గం చూపించాలి!"

రాత్రి రెండున్నరైనా నర్సింగరావ్ నిద్రపోలేదు. అతని డ్రాయింగ్ రూమ్‌లో లైట్లు వెలుగుతున్నాయి. బంగ్లా ముందు కార్లు.... లోపలికెళ్ళే సరికి మరో ముగ్గురు నాయకులతో చర్చలు జరుపుతున్నాడు.

"రండి. రండి. కూర్చోండి" అన్నాడు నర్సింగరావ్.

"యేం కూర్చోవడమో— మా కొంప మునిగిపోయింది. భాస్కర్రావు రాజీనామా చేశాడు! మా ఇద్దరి డబ్బు మూసీలో పోసినట్లే!"

## సాహితీ క్విజ్

1. బుచ్చిబాబుకు చైతన్య ప్రవంతి పద్ధతిలో రచనకు స్ఫూర్తినిచ్చిన రచయిత
2. పరిపాలనా విధానాన్నీ. పాలనా యంత్రాంగాన్నీ విమర్శిస్తూ 'కుక్కుటేశ్వరం' కథ వ్రాసిన చా—సో—అంటే
3. "ఆంధ్ర చెహోవ్" అని శ్రీశ్రీ ఎవరిని అన్నారు
4. "ఓ పువ్వు పూసింది" అనే ఉత్తమ కథ వ్రాసింది
5. "రావోయి బంగారి మామ" అనే మధుర గీతాన్ని వ్రాసింది
6. "వేనరాజు" అనే ప్రసిద్ధ తెలుగు నాటకం వ్రాసినది
7. "చింతామణి" అనే ప్రముఖ నాటక కర్త వ్రాసింది
8. "కవిసార్వభౌమ" బిరుదాంకితులలో ప్రముఖులు
9. అచ్చతెలుగు నిఘంటువుగా ప్రసిద్ధమైంది
10. సాహిత్య విమర్శకు. తెలుగులో ప్రామాణిక గ్రంథ రచన చేసినది

నిర్వహణ : ఎమ్. డి. సౌజన్య

సమాధానాలు

1) జేమ్స్ జాయిస్
2) చాగంటి సోమయాజులు
3) కొడవటిగంటి
4) చలం
5) కవి కొనకళ్ళ వెంకటరత్నం
6) విశ్వనాథ సత్యనారాయణ
7) కాళ్ళకూరి నారాయణరావు
8) శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి
9) ఆంధ్రపద పారిజాతము
10) పింగళి లక్ష్మీకాంతం

"తెల్సింది. తెల్సింది. ఇదుగో మనవాళ్ళతో ఇప్పటివరకూ ఆ విషయమే చర్చించాను. మీరు నష్టపోతే వొకటి. నేను నష్టపోతే వొకటి కాదు. ఇప్పుడీ ప్రమాదం నుంచి బయటపడాలంటే భాస్కర్రావు మంత్రివర్గంలో కొనసాగాలి- అంతేగా?" అన్నాడు నర్సింగరావ్.

"అంతే. అంతే."

"అచ్ఛా. ఈ కాగితాలు చదవండి— ఇప్పుడే తయారుచేశాను" అంటూ కాగితాలు అందించాడు నర్సింగరావు.

చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రిగారైన భాస్కర్రావుగారి అకళంకిత రాజకీయ జీవితాన్నీ-ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు ఆయన చేసిన సేవనూ కొనియాడుతూ. అటువంటి నిస్వార్థపరుడూ నిజాయితీ, ధైర్యమూ గల వ్యక్తి మంత్రి మండలి నుంచి రాజీనామా చేస్తే రాష్ట్ర ప్రజలు ఎంత నష్టపడతారో విశదీకరిస్తూ ముఖ్యమంత్రి వారి రాజీనామాను అంగీకరించరాదని గట్టిగా కోరుతూ రాసిన నాలుగు పేజీల మెమోరాండం అది.

"అర్థమైందిగా మన ఎత్తుగడ? మొదటి దస్కత్తు నాదే. మీరిద్దరు కూడ దస్కత్తులు చేసి మన వాళ్ళందరి చేతా చేయించండి. అసెంబ్లీ సెషన్సు జరుగుతున్నాయి గనుక లెజిస్లేటర్లంతా సిటీలోనే దొరుకుతారు."

"అవును. ఇప్పుడే వాళ్ళంతా నాడిన్నర్ పార్టీనించి ఇళ్ళకెళ్ళింది."

"అచ్ఛా.మీరు వెంటనే బయలేరి దస్కత్తులు సేకరించండి. అన్నీ పూర్తయినాక మెమొరాండం నా చేతికియ్యండి. ఉదయం ముఖ్యమంత్రిని కలుద్దాం. భాస్కర్రావు రాజీనామా ఆమోదించకుండా చేసే బాధ్యత నాది. ముఖ్యమంత్రిని ఎట్లా వొప్పించాలో నాకు తెల్సు. నేనిప్పుడే ఆ భాస్కర్రావుని కలవటానికి పోతున్నాను. మీరు కూడ సంతకాల కోసం బయల్దేరండి" అంటూ లేచాడు నర్సింగరావ్.

"ఆ వెధవని కలవడమెందుకూ?"

"అక్కడే ఉంది ట్రిక్. భాస్కర్రావుని కాస్త వోదార్చి. అతని మంత్రి పదవి పోకుండా చూసే బాధ్యత నాదని భరోసా ఇస్తాను అన్నట్టు చెప్తాను! దాంతో వాడు జీవితాంతం కుక్కలా మనవెంట తిరుగుతాడు మీ ఇద్దరి లైసెన్సులతోపాటు మీరిచ్చిన డబ్బు తిరిగివస్తుంది! లైసెన్సులు మీవి- డబ్బు నాది. సరేనా."

సరేననక చేసేదేముంది?

రంగారెడ్డి, రామరాజులు కాఫీ తాగుదామని వొక హోటలు దగ్గర కార్లాపేసరికి తెలతెలవారుతోంది. దినపత్రిక కొని చూసేసరికి భాస్కర్రావు రాజీనామా వార్త మొదటి పేజీలో ఉంది!

నాస్తా అయిందనిపించుకొని రంగారెడ్డి, రామరాజూ కార్లలో చెరోవైపు సిటీమీద పడ్డారు సంతకాల వేటకోసం.

పది గంటలకు సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తయింది. నర్సింగ్‌రావ్ నాయకత్వంలో అరవై మంది లెజిస్లేటర్లూ, నలుగురు ఎం.పి.లు.ఆ సమయానికి సిటీలో వున్న ఏడెనిమిది మంది సమితి ప్రెసిడెంట్లూ ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞాపన పత్రాన్ని సమర్పించి, భాస్కరరావు మంత్రివర్గంలో కొనసాగవలసిందేనని పట్టుబట్టారు.


అదే రోజు- అంటే జూన్ 31. శనివారం సాయంత్రం ఆకాశవాణి ప్రాంతీయ వార్తల్లో ముఖ్యమంత్రి ప్రకటన ఇలా వచ్చింది:

"భాస్కరరావుగారి వంటి పరిణతి చెందిన వ్యక్తి సేవలు పార్టీకి ఎంత అవసరమైనప్పటికీ వారిలాంటి అనుభవజ్ఞులు, ధైర్యశాలురూ నా మంత్రివర్గంలో ఉండటం మరీ ముఖ్యం. కాబట్టి వారి రాజీనామాను నేను అంగీకరించలేకపోయాను. నా అభ్యర్థన మన్నించి భాస్కరరావుగారు తమ రాజీనామా లేఖను ఉపసంహరించుకొన్నారని సంతోషంగా తెలియజేస్తున్నాను వారు మంత్రిగా ఎప్పటిలాగే ఆంధ్రప్రజలకు తమ అమూల్యమైన సేవలను అందజేస్తూ ఉంటారు. వారికి నా తరపునా, నా ప్రజల తరపునా కృతజ్ఞతలు."


నిరోధ్‌తో...
మరో బిడ్డ పుట్టేముందు,
కాల వ్యవధితోపాటు
ఆరోగ్యాన్ని, దారుఢ్యాన్ని పుంజుకోండి



మీకు తొలి బిడ్డ పుట్టిన తర్వాత, మలి బిడ్డ పుట్టే వరకు తగినంత కాల వ్యవధి అవశ్యం. ఈ ప్రత్యామ్నాయాన్ని నిరోధ్ మీకు సమకూర్చగలదు కనుక మీ భవితవ్యాన్ని మీరే ఎన్నుకుని, ఏర్పరచుకోండి.




నిరోధ్ వాడండి
సుఖప్రదమైన, నిశ్చింతయైన
వైవాహిక జీవితానికి

డిస్ట్రిబ్యూటర్లు. బ్రూక్ బాండ్, లిప్టన్, హిందూస్థాన్ లీవర్, ఐ.టి.సి., టాటా ఆయిల్ మిల్స్, యూనియన్ కార్బైడ్, ఐడిపిఎల్, స్మిత్ స్టానీ స్ట్రీట్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం మరియు అరసన్ మ్యాచ్ ఇండస్ట్రీస్.

davp 83/220